www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 9 జులై 2025
5
ఏలూరు



తోటల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రైతులు తోటలను పెంచేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ఏపిఎంఐపి అరేపల్లి శిరీష, జాతీయ ఉపాధి హామీ ఏపిఒ మీనాక్షి తెలిపారు. ఓగిరాల తండా గ్రామంలో మంగళవారం ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా వివిధ రకాలైన తోటలు పెంచేందుకు రైతాంగానికి అనేక సబ్సిడీలు అందిస్తున్నారని తెలిపారు. పామాయిల్ మొక్కల పెంపకం కోసం జాతీయ ఉపాధి హామీ ద్వారా ఎకరానికి రూ.55,570 చొప్పున మూడు సంవత్సరాలపాటు రైతులకు అందించనున్నట్లు చెప్పారు. మామిడి తోట పెంపకానికి రూ.1,09,950, జామ తోటల పెంపకానికి రూ.1,46,971, నిమ్మతోటలకు ఎకరాకు రూ.1,46,311 చొప్పున రెండు సంవత్సరాలపాటు, సపోటా తోటల పెంపకానికి రూ.95,584 అందించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు యనమల వాసు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ..
నేడు సమ్మె

- దేశవ్యాప్తంగా కార్మిక హక్కుల పరిరక్షణకు పని బంద్
- కార్మిక చట్టాల నిర్వీర్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తిరుగుబాటు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొనసాగనున్న నిరసనలు, ర్యాలీలు, సభలు
- సమ్మెలోకి 55 వేల మందిపైగా కార్మికులు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కార్మికుల హక్కులను హరించేందుకు మోడీ సర్కార్ అమలు చేయాలని చూస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా బుధవారం రెండు జిల్లాల్లోని కార్మికులంతా సమ్మె బాట పట్టేందుకు సిద్ధమయ్యారు. సిఐటియు, ఐఎఫ్‌టియు, ఎఐటియుసి తదితర కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన సమ్మెకు అన్ని తరగతుల నుంచి పూర్తిస్థాయిలో మద్దతు లభిస్తోంది. బుధవారం ఉదయం నుంచి జిల్లాలోని కార్మికులంతా పని బంద్ చేసి సమ్మెలో పాల్గొనున్నారు. జిల్లా కేంద్రాలు ఏలూరు, భీమవరంతోపాటు పట్టణ, మండల కేంద్రాలు, గ్రామాల్లో సైతం ఉధృతంగా సమ్మె నిర్వహించేందుకు కార్మికులంతా ఇప్పటికే పిలుపునిచ్చారు. కొన్ని రోజులుగా సమ్మె సన్నాహాలు అన్ని ప్రాంతాల్లోనూ పెద్దఎత్తున సాగాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వివిధ పరిశ్రమల్లో పని చేసే కార్మికులు, హమాలీలు, భవన నిర్మాణ కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు ఇలా 55 వేల మందికిపైగా కార్మికులు సమ్మెలోకి దిగనున్నారు. సమ్మె నేపథ్యంలో ర్యాలీలు, నిరసనలు, సభలతో జిల్లా అంతా హోరెత్తనుంది. జిల్లా కేంద్రం ఏలూరులో పవర్‌పేట రైల్వేస్టేషన్ నుంచి కార్మికులంతా భారీ ర్యాలీ నిర్వహించి ఆర్ఆర్‌పేట పార్క్ వద్ద సభ నిర్వహించనున్నారు. జిల్లా నాయకులతోపాటు రాష్ట్ర నాయకులు సైతం పాల్గొనున్నారు. తమ సత్తా ఏమిటో కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి తెలియజేసేందుకు కార్మికులంతా ఏకమై సమ్మెలోకి వెళ్లనున్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం, తర్వాత కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి వాటిస్థానంలో నాలుగు లేబర్‌కోడ్‌లు తెచ్చి కార్పొరేట్లకు మేలు చేయాలని మోడీ సర్కార్ కొంతకాలంగా ఉవ్విళ్లూరుతోంది. 2020లోనే ఈ కోడ్‌లు తీసుకొచ్చినప్పటికీ కార్మికుల ఆగ్రహం చవిచూడాల్సి వస్తుందనే భయంతో అమలు మాత్రం చేయలేదు. ఈ ఏడాది లేబర్‌కోడ్‌లను అమల్లోకి తేవాలని మోడీ సర్కార్ ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే దీన్ని వ్యతిరేకిస్తూ దేశంలోని కార్మికులంతా సమ్మె సైరన్ మోగించారు.

నిరకుంశ కార్మిక కోడ్‌లపై తిరుగుబాటు

మోడీ సర్కార్ తెచ్చిన లేబర్ కోడ్‌లతో దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలుస్తున్న కార్మికుల హక్కులు హరించుకుపోనున్నాయి. కార్మికులు సాధించిన 29 చట్టాలను రద్దు చేసి మోడీ సర్కార్ వేతనాల కోడ్, పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తి భద్రత ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ ఇలా మొత్తం నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తేవాలని చూస్తోంది. దీంతో కనీస వేతనం అమలుకు నోచుకోని పరిస్థితి రానుంది. ఇప్పటికే ఎనిమిది గంటల పని విధానానికి తూట్లు పొడుస్తూ పది గంటలకు పెంచుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేసి ముందుకు సాగుతున్నాయి. కార్మికులకు రక్షణగా ఉన్న 29 చట్టాలు రద్దయితే కార్మిక లోకంపై కార్పొరేట్లకు పూర్తి ఆధిపత్యం ఏర్పడనుంది. లేబర్ కోడ్‌లను ఎట్టిపరిస్థితుల్లోనూ అమలు చేయడానికి వీల్లేదంటూ కార్మిక లోకమంతా పని బంద్ చేసి సమ్మెలోకి దిగనుంది. మోడీ సర్కార్ మెడలు వంచేందుకు కార్మికులు తమ శక్తి ఏమిటో సమ్మెతో మరోసారి చాటనున్నారు.

సమరశీలంగా భూఉద్యమాలు

- మండవల్లి ఇళ్ల స్థలాలు, సింగనపూడి ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ భూముల సమస్య పరిష్కరించాలి: సింగనపూడి భూ సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - మండవల్లి



సదస్సులో మాట్లాడుతున్న రవి

భూములు, ఇళ్ల స్థలాల సమస్యపై భూ ఉద్యమాలు సమరశీలంగా సాగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. మండవల్లి ఇళ్ల స్థలాలు, సింగనపూడి ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ భూముల సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మంగళవారం సింగనపూడిలోని కమ్యూనిటీ హాల్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో భూములు, ఇళ్ల స్థలాల సమస్యపై భూసదస్సు నిర్వహించారు. సదస్సుకు ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు కర్రా జగదీష్ అధ్యక్షత వహించారు. ముందుగా సిపిఎం జెండాను ఆవిష్కరించారు. భూపోరాటాలు వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ముఖ్యఅతిథి రవి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన పాలకులు భూసమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. పేదలు, దళితుల భూములు అన్యాక్రాంతమై తరతరాలుగా వాటిని రెవెన్యూ అధికారులు పరిష్కరించకపోవడం వల్ల భూసమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేతిలో భూమి లేక, తగిన ఉపాధి లేక పేదలు పేదలుగానే మిగిలిపోతున్నారని చెప్పారు. భూస్వాములు, పెట్టుబడిదారుల చేతుల్లో పేదలకు చెందాల్సిన లక్షల ఎకరాల భూములు ఉండటం వల్ల పేదరికం ఎదగలేకపోతున్నారన్నారు. పేదల చేతికి భూమి వస్తేనే సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలు తగ్గిపోతాయని చెప్పారు. ప్రభుత్వాలు ఎన్ని పథకాలు అమలు చేసినా పేదల బతుకుల్లో మార్పు రావడం లేదని, భూపంపిణీనే దీనికి పరిష్కారమని అన్నారు. ఇప్పటికైనా పేదలకు దక్కాల్సిన భూములు వారికి చెందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా అనేక చోట్ల భూపోరాటాలు నిర్వహిస్తున్నామని వివరించారు. పోలీసు నిర్బంధాలతో, అధికార పార్టీ నాయకుల బెదిరింపులతో భూస్వాములకు తొత్తులుగా మారి పేదలను బెదిరిస్తే భూపోరాటాలు ఆగిపోవని, మరింత ఉధృతమవుతాయని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ భూస్వాములు, కార్పొరేట్లకు ప్రాతినిధ్యం వహించే పార్టీలు అధికారంలో ఉన్నంతకాలం పేదల భూసమస్యలు పరిష్కారం కావన్నారు. పేదల భూసమస్యల పరిష్కారం కావాలంటే పోరాటాలే మార్గమని చెప్పారు. పైగా పేదల చేతుల్లో ఉన్న భూములను బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు పెద్దఎత్తున భూసేకరణ చేస్తున్నారని విమర్శించారు. పేదల భూసమస్యలు పరిష్కరించి ఆదుకునే వరకు పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు వేస్తూ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ కార్యదర్శి ఉచ్చుల సుధీర్‌కుమార్, సొసైటీ సభ్యులు పక్కిరి దావీదు, పక్కిరి జేమ్స్, బొడ్డు ఆనందరావు, పక్కిరి పౌలు, యెహోషువా, బొడ్డు చింతయ్య, మేరుగు సునీత, పులవర్తి కవలమ్మ, పాముల సుశీల పద్మ, సూర్యం, సింహాచలం, పద్మమ్మ పాల్గొన్నారు.

నేడు సమ్మెను జయప్రదం చేయాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు, కార్మికులు

ప్రజాశక్తి - భీమడోలు రూరల్

కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ జాతీయ కార్మిక సంఘాల పిలుపుమేరకు ఈ నెల 9న సమ్మెను మండలంలో జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు కోరారు. సమ్మె సన్నాహాల్లో భాగంగా పూళ్లలోని రైస్ మిల్లు వద్ద కార్మికులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. అసంఘటిత రంగంలో పని చేస్తున్న కోట్లాది మంది కార్మికులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్, ప్రమాద బీమా వంటివి లేనందువల్ల వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కనీస వేతనాల చట్టాన్ని రద్దు చేసిందని, ఎనిమిది గంటల పని హక్కును రద్దు చేసి పది గంటలు పని చేయాలని హుకుం జారీ చేసిందన్నారు. ఇలాంటి నిర్ణయాలతో మోడీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మారుస్తుందని విమర్శించారు. కార్మికుల హక్కుల రక్షణ కోసం తలపెట్టిన ఈ సమ్మెలో వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా కార్యకర్తలను కలిసి సమ్మెలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు కె.వెంకటేశ్వరరావు, బెండి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పెరుగుతున్న గోదావరి వరద

- పోలవరం నుండి 2,02,463 క్యూసెక్కుల జలాలు విడుదల

ప్రజాశక్తి - పోలవరం

పోలవరంలో గోదావరి నీటిమట్టం మంగళవారం నాటికి స్వల్పంగా పెరిగింది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలు, గోదావరి ఉపనదుల వరద నీరు గోదావరిలో కలుస్తుండటంతో నీటిమట్టం పెరిగింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 19.60 అడుగులకు చేరుకుంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్వేలోకి చేరుకున్న 2,02,463 క్యూసెక్కుల అదనపు జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 28.050 మీటర్లు, దిగువన 18.460 మీటర్లు, ఎగువ కాపర్ డ్యామ్‌కు ఎగువన 28.200 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్‌కు దిగువన 17.500 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యాముల మధ్య 15.680 మీటర్లు నీటిమట్టం నమోదైంది. స్పిల్వేలోకి వస్తున్న అదనపు జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు దిగువన 6.43 మీటర్లు నీటిమట్టం నమోదైందని, ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నిలకడగా ఉందని సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.

కుక్కునూరు రూరల్: గోదావరికి వరద ఉధృతి మళ్లీ పెరుగుతుంది. సోమవారం భద్రాచలంలో 18.6 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం మంగళవారం 19.09 అడుగులకు చేరుకుంది. బుధవారం నాటికి గోదావరి పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

వేలేరుపాడు రూరల్: గోదావరికి వరద ఉధృతి మళ్లీ పెరుగుతుండటంతో మండలవాసుల్లో ఆందోళన నెలకొంది. రానున్న రెండు రోజుల్లో వరద బాగా పెరుగుతుందని అధికారులు హెచ్చరించడంతో సర్వత్రా తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని, అక్కడ అన్ని సౌకర్యాలూ కల్పిస్తామని అధికారులు చెబుతున్నారు.


వేలేరుపాడులో గోదావరి ఉధృతి

10న ఏజెన్సీలో సిపిఎం రాష్ట్ర బృందం పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల పదో తేదీన ఏజెన్సీ ప్రాంత సమస్యలపై సిపిఎం రాష్ట్ర, జిల్లా నాయకత్వ బృందం పర్యటించనుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తేదీ గురువారం ఏజెన్సీ ప్రాంతంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వంలో రాష్ట్ర, జిల్లా నాయకుల పర్యటన ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు జీలుగుమిల్లి నుండి ప్రారంభమయ్యే ఈ పర్యటన అక్కడి ఎల్‌టిఆర్, 1/70 చట్టం భూముల పరిశీలిస్తుందని, 11 గంటలకు అంకంపాలెం చేరుకుని ఆర్అండ్ఆర్ మిగుల భూములు పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం బుట్టాయగూడెం, రెడ్డిగణపవరం ప్రాంతాల్లోని ఆర్అండ్ఆర్ భూముల అమ్మక ప్రతిపాదిత భూముల పరిశీలన, ఇనుమూరు గ్రామంలో ఎల్‌టిఆర్, 1/70 భూముల పరిశీలకుంటుందని పేర్కొన్నారు. అనంతరం అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవనాలు పరిశీలిస్తారని తెలిపారు. 3.30 గంటలకు పోలవరం ప్రాజెక్టు వద్దకు చేరుకుని ప్రాజెక్టుని పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం ప్రాజెక్టు బ్రిడ్జిపై నుండి నేతలు దేవీపట్నం వెళ్తారని తెలిపారు. ఈ పర్యటనలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు, గిరిజనులు అందరూ పాల్గొనాలని, సమస్యలు తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వరదలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

- మూడు రోజుల్లో భద్రాచలం నుండి 9 లక్షల క్యూసెక్కుల నీరు విడుదలయ్యే అవకాశం
- ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా పటిష్టమైన చర్యలు
- అధికారులకు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశం


గోదావరి ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్, ఆర్‌డిఒ

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

ప్రస్తుత వర్షాకాలంలో సంభవించే తుపాన్లు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం వరదలపై ముందస్తు ప్రణాళిక సమావేశంలో అన్ని శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న మూడు రోజుల్లో భద్రాచలం నుండి గోదావరి వరద నీరు 9 లక్షల క్యూసెక్కులపైగా దిగువకు వచ్చే అవకాశం ఉందని, అంతేకాక పెదవాగు, ఎద్దువాగుల నుండి కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు వరద ముంపు ప్రభావం పొంచి ఉన్నందున, ఆయా ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రసవానికి సిద్ధంగా ఉన్న గర్భిణులను దగ్గర్లోని ప్రభుత్వాసుపత్రికి తరలించాలని అన్నారు. కొయిదా వంటి కొండ ప్రాంతాల గ్రామాల ప్రజలకు, వరద ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజలకు టార్పాలిన్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రమాద హెచ్చరికలు జారీ చేసిన వెంటనే అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అనువైన ప్రదేశాలను ముందుగానే గుర్తించాలన్నారు. ఆ ప్రదేశాల్లో ప్రజలను ఉంచేందుకు తాత్కాలిక షెడ్లు, తాగునీరు, టాయిలెట్లు వంటి సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. పాడి పశువులను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించి, దాణా, నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాల కారణంగా శిథిలావస్థలో ఉన్న భవనాలు, బ్రిడ్జిలు, కల్వర్టులు, కాజ్‌వేలను గుర్తించి, ముందుగానే మరమ్మతులు చేయించాలన్నారు. నదులు, కాల్వలు, చెరువు గట్లను పరిశీలించి బలహీనంగా ఉన్న చోట్ల పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో తాగునీరు కలుషితం కాకుండా రక్షిత తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో పంపిణీ నిమిత్తం మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు సిద్ధం చేయాలని పౌర సరఫరాల శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, ఆర్‌డిఒ రమణ, డిఆర్‌డిఎ పీడీ కె.విజయరాజు, ఇరిగేషన్ ఎస్ఇ నాగార్జునరావు, డిపిఒ కె.అనురాధ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ త్రినాథ్‌బాబు, వ్యవసాయ శాఖ జెడి హబీబ్ భాషా, ట్రాన్స్‌కో ఎస్ఇ సాల్మన్‌రాజు, గృహనిర్మాణ శాఖ పీడీ సత్యనారాయణ, డిఎస్‌పి వెంకటేశ్వరరావు, తహశీల్దార్ డివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆమె తాట్కూరుగొమ్ము వద్ద గోదావరి వరద ప్రవాహాన్ని పరిశీలించారు. వరద పెరుగుతున్న నేపథ్యంలో ఆ ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ఎవరూ నదిలోకి దిగొద్దని, ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. ముంపు ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.


కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న నిర్వాసితులు

మాకు న్యాయం చేయండి

- కలెక్టర్‌కు నిర్వాసితుల వినతి

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న తమకు ఏళ్లు గడుస్తున్నా న్యాయం జరగడం లేదని నిర్వాసితులు జిల్లా కలెక్టర్ వద్ద వాపోయారు. కలెక్టర్ తహశీల్దార్ కార్యాలయానికి వచ్చారని తెలుసుకున్న నిర్వాసితులు తమ సమస్యలు విన్నవించుకుందామని అక్కడికి చేరుకున్నారు. యర్రబోరు, తాట్కూర్ గొమ్ము కాలనీ, నడిమి గొమ్ము కాలనీ, శివకాశిపురం గ్రామాల ప్రజలు తమ గ్రామాలను కూడా 41వ కాంటూర్‌లో కలపాలని వినతిపత్రాలు అందజేశారు. ఎర్రబోరు గ్రామంలో రెండు పంచాయతీలు కారణంగా తాట్కూరు గొమ్ము, పంచాయతీ ఎర్రబోరు గ్రామంలో 150 కుటుంబాలకు పరిహారాన్ని అందించకపోవడం, రేపాకగొమ్ము పంచాయతీలో వచ్చే ఎర్రబోరులోని వంద కుటుంబాలకు వేలేరుగా పరిగణించి పరిహారం అందజేశారని తెలిపారు. తమది జగన్నాథపురం హేబిటేషన్ అయినప్పటికీ తమకు పరిహారం అందలేదని వాపోయారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ మీరు చెప్పిన గ్రామాలన్నీ 45వ కాంటూరు పరిధిలో ఉన్నాయని, ప్రస్తుతానికి ప్రభుత్వం 41.15 కాంటూర్ పరిధిలో ఉన్న గ్రామాల్లోని నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ పరిహారం అందజేసి, వారికి పునరావాసం కల్పిస్తుందన్నారు. తర్వాత 45వ కాంటూరు పరిధిలోని గ్రామాల ప్రజలకు సంబంధించిన వివరాలన్నీ తెలియజేయాలని ప్రభుత్వం సూచించిందని, ప్రస్తుతానికి 41.15వ కాంటూరు పరిధిలో కొత్తగా 14 గ్రామాలను చేర్చారని, మళ్లీ సర్వే చేపట్టి వారికి న్యాయం చేస్తామని చెప్పారు.

హామీల అమలు కోరుతూ ఎస్ఎస్ఎ సిబ్బంది నిరసన


నినదిస్తున్న ఎస్ఎస్ఎ సిబ్బంది

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మినిమమ్ టైమ్ స్కేల్, హెచ్ఆర్ పాలసీతోపాటు సమ్మె ఒప్పందం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జెఎసి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భోజన విరామ సమయంలో స్థానిక ఎస్-ఎస్ఎ జిల్లా కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా జెఎసి ఛైర్మన్ కె.వినోద్‌కుమార్ మాట్లాడుతూ విద్యాశాఖ-సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగులకు మినిమమ్ టైమ్ స్కేల్, హెచ్ఆర్ పాలసీ, సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని, పని భారం తగ్గించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, పిఎఫ్, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. మెడికల్ లీవులు ఇవ్వాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత అధికార పక్షం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలే తాము అడుగుతున్నామని, కొత్తగా ఏమీ అడగటం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కార్యదర్శి రాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షులు ఆనంద్‌కుమార్, మణికంఠ రాజు, సతీష్, ఫణి కుమార్, బాలాజీ పాల్గొన్నారు.

మండవల్లి: సమగ్ర శిక్ష ఉద్యోగులు స్థానిక ఎంఆర్‌సి కేంద్రంలో మధ్యాహ్న భోజన విరమణ సమయంలో నిరసన తెలిపారు. ఈ ఆదివారం, రెండో శనివారం కూడా అత్యవసర పనుల కింద తమతో పని చేయిస్తున్నారని, దానికి ప్రత్యామ్నాయ సెలవు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్ వెంకటరత్నం, ఎంఐఎస్ కోఆర్డినేటర్ కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

'చింతలపూడి'లో కోకో ఫ్యాక్టరీ ఏర్పాటుకు కృషి

- ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి


మాట్లాడుతున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

కోకో రైతుల కోసం చింతలపూడి నియోజకవర్గంలో ఫ్యాక్టరీ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. ఫాతిమాపురం మెట్టగూడెంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో భాగంగా పండ్ల మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కోకో సాగుతో రైతులకు లాభాలు వచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. కోకో ఫ్యాక్టరీ పెట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. రైతులకు మేలు చేసేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ఒకే రోజు ముగ్గురికి పాము కాట్లు

ప్రజాశక్తి - పోలవరం

ఒకే రోజు ముగ్గురు వ్యవసాయ కూలీలు పాముకాటుకు గురై ఆస్పత్రి పాలైన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజు తెలిపిన వివరాల ప్రకారం చేగొండపల్లి గ్రామానికి చెందిన కట్టమూరి హరీష్, ప్రగడపల్లి గ్రామానికి చెందిన కుప్పాల సుబ్బారావు, కొత్తపట్టిసీమ గ్రామానికి చెందిన రొంగల వెంకట్రావు ఉదయం వేర్వేరు చోట్ల పంట చేలల్లో పని చేస్తుండగా పాముకాట్లకు గురయ్యారు. బాధిత కుటుంబ సభ్యులు వారిని పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించారు. బాధితులకు సకాలంలో చికిత్స అందించామని, ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగానే ఉందని, ఐదు రోజులపాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలని తెలిపారు. పాములు, తేళ్లు, విష కాటకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సూచించారు.


పోలవరంలో చికిత్స పొందుతన్న వెంకట్రావు

నూరుశాతం సీట్ల భర్తీకి ప్రణాళిక

- ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాజీవ్‌గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం (ఆర్‌జియుకెటి) పరిధిలోని ట్రిపుల్ ఐటీల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టినట్లు ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ తెలిపారు. నూజివీడులో ఆయన మంగళవారం మాట్లాడుతూ నూజివీడు, ఆర్కే వ్యాలీ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో మొత్తం 4040 సీట్ల భర్తీకి అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల ఐదో తేదీన ముగిసినట్లు తెలిపారు. నాలుగు ట్రిపుల్ ఐటీల్లో మిగిలిన 600 సీట్ల భర్తీకి శ్రీకారం చుట్టామన్నారు. గతేడాది 700 సీట్లు మిగిలాయని, ఈ ఏడాది ఆ సీట్ల సంఖ్య 600కు తగ్గినట్లు చెప్పారు. మిగిలిన సీట్లు భర్తీ ప్రక్రియకు ముందుగా విద్యార్థుల కోరిన మీదట రిజర్వేషన్ ప్రక్రియ అమలు చేస్తూ బదిలీ కార్యక్రమం చేపడతామన్నారు. అనంతరం సెకండ్, థర్డ్ కౌన్సెలింగులు నిర్వహిస్తామన్నారు. స్పెషల్ కేటగిరీగా ఉన్న పిహెచ్‌సి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, క్యాప్ కేటగిరీలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. స్పోర్ట్స్, ఎన్‌సిసి విభాగాలకు చెందిన సీట్ల భర్తీ ప్రక్రియ కొద్దిగా ఆలస్యమవుతుందని చెప్పారు. మొత్తంగా ఈ నెల 22, 23 తేదీల్లో సీట్ల భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.

రాఘవాపురం సొసైటీలో రూ.32 లక్షలు అవకతవకలు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని రాఘవాపురం సొసైటీలో రూ.32 లక్షలు అవకతవకలు గుర్తించినట్లు నూజివీడు డిఆర్ రవికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి మండలం రాఘవాపురం సొసైటీలో రెండు నెలలుగా నగదు లావాదేవీలు జరగడం లేదని, సాధారణ తనిఖీల్లో భాగంగా ఆడిట్ చేయగా రూ.32 లక్షలు మేర అవకతవకలు జరిగినట్లుగా గుర్తించామని తెలిపారు. దీనిపై విచారణకు డిసిసిబి సిఇఒకు నివేదించినట్లు చెప్పారు.

దాచారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పరిశీలన

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

మండలంలోని దాచారం ఆర్ అండ్ ఆర్ కాలనీని పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, గృహ నిర్మాణ శాఖాధికారులు పరిశీలించారు. వరదలను దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందస్తు జాగ్రత్త చర్యగా పునరావాస కేంద్రాలకు తరలించేందుకు పునరావాస కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి వారి ఆదేశాల మేరకు మంగళవారం వారు పరిశీలించారు. వరద బాధితులను పునరావాస కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. సందర్శించిన వారిలో పంచాయతీరాజ్ ఎఇఇ కె.శ్రీను, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ జి.త్రినాథ్‌బాబు, గృహ నిర్మాణ శాఖ డిఇ జి.సత్యనారాయణ తదితరులున్నారు.

సమ్మెకు సంపూర్ణ మద్దతు : రైతు సంఘం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు 9న జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం ఆప్కాబ్ భవనంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కార్మిక హక్కుల కోసం కేంద్ర మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జరుగుతున్న సార్వత్రిక సమ్మెకు రైతు సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. జిల్లాలో అన్ని మండల కేంద్రాల్లో జరుగుతున్న ప్రదర్శనలు, నిరసన కార్యక్రమాల్లో రైతాంగం పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

క్వారీలో బాంబుల పేలుళ్లతో ఇబ్బందులు

ఎంఎల్‌ఎ వద్ద ఫాతిమాపురం వాసుల గోడు

ప్రజాశక్తి - చింతలపూడి

క్వారీలో బాంబులు పేల్చినప్పుడు పేలుడికి రాళ్లు ఎగిరి ఇంటి మీద పడుతున్నాయని ఫాతిమా పురం వాసులు చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ ఎదుట వాపో యారు. మండలంలోని ప్రగడవరం పంచాయతీ మేటగూడెం లోని ఫాతిమాపురంలో ఉన్న క్వారీలో బాంబు పేలుళ్లకు ఇళ్లు, రోడ్లు బీటలు వారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్షర్ క్వారీల్ పరిమితికి మించి బాంబులు పేల్చడంతో వచ్చే దుర్వాసనకు అనారోగ్యానికి గురవుతున్నామని వాపోయారు. చిప్స్ క్వారీ పగలు రాత్రి తేడా లేకుండా మిషనరీ రన్నింగ్ చేయడంతో కంటిమీద కునుకు లేని పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. దీనిపై ఎంఎల్‌ఎ మాట్లాడుతూ తక్షణమే కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రక్షణ కల్పించాలంటూ ఎస్‌పికి వినతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎంఆర్ చాయ్ యజమాని షరీఫ్‌పై చర్యలు తీసుకుని తమకు ప్రాణ రక్షణ కల్పించాలని ఎస్‌పికి బాధితురాలు సోమవారం వినతి పత్రం అందించింది. ముదినేపల్లిలోని ఎంఆర్ చాయ్ అనే హోటల్లో గత నెల 27న ముదినేపల్లికి చెందిన ఎ.వెంకటలక్ష్మి మటన్ బిర్యానీ పార్సిల్ ఇంటికి తెచ్చుకుంది. బిర్యానీ మటన్ కాదు బీఫ్ అనే అనుమానంతో వెళ్లి ఎంఆర్ చాయ్ హోటల్ యజమాని షరీఫ్‌ను ప్రశ్నించింది. దీంతో ఆగ్రహంతో షరీఫ్ ఆమెను దుర్భాషలాడుతూ నీకు చేతనైంది చేసుకోండి నన్ను ప్రశ్నిస్తే మీ అంతు చూస్తానంటూ బెదిరించాడు. ఈ విషయమై వెంకటలక్ష్మి ఎస్‌పిని కలిసి షరీఫ్, గౌస్ వల్ల ప్రాణహాని ఉందని, తనకు రక్షణ కల్పించి విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదు చేసింది.

పుంత రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఉంగుటూరు


పనులను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ

నారాయణపురం దండు దారి పుంత రోడ్డు నిర్మాణ పనులను ఎంఎల్‌ఎ ధర్మరాజు మంగళవారం పరిశీలించారు. ఈ రోడ్డు నిర్మాణాన్ని ఉపాధి హామీ నిధులతో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. పనుల పురోగతి, నాణ్యత తదితర అంశాలపై పంచాయతీరాజ్ డిఇ వేణుగోపాల్‌తో మాట్లాడారు. రోడ్డు నాణ్యతలో రాజీ పడకుండా విస్తరించాలని అధికారులను ఆదేశించారు. ఎఇ కృష్ణమోహన్, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఐకమత్యంగా ఉండాలి

ప్రజాశక్తి - ముసునూరు

ఉపాధ్యాయులందరూ ఐకమత్యంగా ఉంటే ఏమైనా సాధించవచ్చని యుటిఎఫ్ మండల నాయకులు జి.పద్మకిశోర్ అన్నారు. యుటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం, చెక్కపల్లి, లోపూడి గ్రామాల్లో పద్మ కిషోర్, ప్రధాన కార్యదర్శి రాంబాబు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కాసాని గంగేయుదు, సీనియర్ నాయకులు జ్యోతి ప్రకాష్, విష్ణువర్ధన్ రావు, పుల్లయ్య, నారాయణ, వరప్రసాద్ పాల్గొన్నారు. మండలంలో యుటిఎఫ్ సభ్యత్వంలో ఉపాధ్యాయులను అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న మండల టీమ్‌ను జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వరావు అభినందించారు.

పోస్టుల ఖాళీతో ప్రజల ఇబ్బందులు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలో అధికారులు ఇన్‌ఛార్జులు, మరికొన్ని పోస్టులు ఖాళీగా ఉండటంతో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైసిపి మండలాధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు (నాని) అన్నారు. ముసునూరులో ఎంపిపి కొండ దుర్గాభవాని వెంకటరావు, జడ్ ఎంపిపి కోటగిరి రాజానాయన ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. తహశీల్దార్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ, ఉంగరా ప్రభుత్వ పశు వైద్యశాలలో అసలే వైద్యులే లేరన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో డ్రెయినేజ్ వ్యవస్థ చాలా దారుణంగా ఉందన్నారు. పారిశుధ్యం, వీధిలైట్ల సమస్యను పట్టించుకోవడంలేదని, వ్యవసాయ విద్యుత్ సరఫరాపై కోతలు విధించడంతో రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.

పండ్ల తోటల పెంపకానికి నాంది

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరులో ఉపాధి హామీ చట్టం ద్వారా రైతుల పొలాల్లో పండ్ల తోటల పెంపక కార్యక్రమంలో భాగంగా నిమ్మ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు మాట్లాడుతూ ఉపాధి హామీని నిజమైన అభివృద్ధి పథకంగా మార్చేందుకు ఇది ఒక అద్భుతమైన ముందడుగన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఎపిఒ రోజీలిల, నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి బాబీ, ఉప సర్పంచి తోట శ్రీనివాసరావు, టిడిపి నాయకులు నక్క యోహాన్, గార్లపాటి నరసింహారావు, తులిమెలి రంగారావు, రైతులు, ఉపాధి హామీ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జిఒ 77ను రద్దు చేయాలి

నూజివీడు టౌన్ : పట్టణంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదల కోసం జిఒ 77 రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 11వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ ఎదుట జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని ఎఐఎస్‌ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు నూజివీడులో ఉన్న యూనివర్సిటీ సంస్థ ధర్మ అప్పారావు పిజి కళాశాల, వాగ్దేవి కాలేజీ, శారద డిగ్రీ కాలేజీ, సిద్ధార్థ డిగ్రీ కాలేజీ, వికాస్ డిగ్రీ కాలేజీ విద్యార్థులను కలిసి కరపత్రాలు అందించారు.

నేరాలు – ఘోరాలు

అనుమానంతో మహిళ దారుణ హత్య

ప్రజాశక్తి - కలిదిండి

తన భార్య వివాహేతర సంబంధానికి ఓ మహిళే కారణమని, ఆ మహిళను ఓ వ్యక్తి హత్య చేశాడు. ఈ ఘటన మండలంలోని పోతుమర్రు పంచాయతీ గొల్లగూడెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కట్టా రామాంజనేయులు, నంగెడ్డ వరలక్ష్మిదేవి (38) ఎదురెదురు ఇళ్ల. వీరిద్దరు స్నేహంగా ఉండేవారు. ఈ క్రమంలో తన భార్య వివాహేతర సంబంధానికి వరలక్ష్మిదేవే కారణమని భావించిన రామాంజనేయులు మంగళవారం ఉదయం వరలక్ష్మి ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెళ్లి కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త ఆటో డ్రైవర్ జీవనం సాగిస్తున్నాడు. ఏలూరు నుంచి వచ్చిన క్లూస్ టీమ్ వివరాలు సేకరించింది. కైకలూరు టౌన్ సిఐ కృష్ణ, రూరల్ సిఐ రవికుమార్, కలిదిండి ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రామాంజనేయులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్, కళాశాలల బస్సులు

విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన
అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేయాలని వేడుకోలు

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలు ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతున్నారని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా అర్హత లేని డ్రైవర్లను కొనసాగిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని వాపోతున్నారు. మండలంలోని దేశవారం, రేచర్ల గ్రామాల్లో ఇటీవల బస్సులు ఫిట్‌నెస్ లేక నిలిచిపోయాయని చెబుతున్నారు. సంబంధిత అధికారులు తనిఖీలు చేయరా అని ప్రశ్నిస్తున్నారు.

మండలంలోని రేచర్ల గ్రామంలో ఇటీవల ఓ ప్రయివేట్ కళాశాల బస్సు మొరాయించి నిలిచిపోయింది.


మొరాయించిన ప్రయివేట్ కళాశాల బస్సు (ఫైల్)

బస్సును విద్యార్థులు ముందుకు నెట్టారు. కొన్నిరోజుల క్రితం దేశవరంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. లైసెన్సు లేని వారు స్కూల్ బస్సు నడుపుతున్నారని విద్యార్థుల తల్లితండ్రులు చెబుతున్నారు. పాఠశాల, కళాశాల బస్సులను రవాణా శాఖాధికారులు తనిఖీలు చేయరా, ప్రమాదాలు జరిగిన తరువాత తనిఖీలు చేస్తారా అని వారు ప్రశ్నిస్తున్నారు. కనీసం బస్సులకు సరైన టైరు ఉండడంలేదని, పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని బస్సుల్లో ఫైర్ సేఫ్టీ, ఫస్ట్ ఎయిడ్ ఉండడం లేదని, అనుభవం లేకపోయినా, హెవీ లైసెన్స్ లేకపోయినా డ్రైవర్‌గా తీసుకుంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

స్కూల్ బస్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్.

పాఠశాల, స్కూల్ బస్సులు విద్యార్థులను తీసుకెళ్లడానికి సురక్షితంగా ఉందో లేదో నిర్ధారించుకోవడానికి తనిఖీ తర్వాత ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇస్తారు. స్కూల్, కళాశాల బస్సులు నడపడానికి చట్టబద్ధంగా చెల్లుబాట అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. రవాణా శాఖ క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్షుణ్ణంగా తనిఖీ చేయాలి
దీపక్, చింతలపూడి

పాఠశాల, కళాశాల బస్సుల క్షుణ్ణంగా తనిఖీ చేసి ఫిటినెస్ సర్టిఫికెట్ ఇవ్వాలి. అనుభవం, లైసెన్స్ కలిగిన డ్రైవర్లనే తీసుకోవాలి. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించకూడదు.


శ్రీనివాసరావును అభినందిస్తున్న వైసిపి నేతలు

వైసిపి గ్రామ అధ్యక్షునిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వైసిపి ఆగిరిపల్లి గ్రామ అధ్యక్షులుగా చిమట శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు వైసిపి మండలాధ్యక్షులు బెజవాడ రాంబాబు, వి.సక్కేశ్వరరావు, మౌలాలీ, శ్రీమన్నారాయణ, ప్రదీప్, సుభానీ, రాజేష్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని నూజివీడు రూరల్ సిఐ కె.రామకృష్ణ హెచ్చరించారు. ఆగిరిపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, సోషల్ మీడియా దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, తదితర అంశాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.శుభశేఖర్, పోలీసు సిబ్బంది, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లు నాణ్యంగా నిర్మించాలి

ప్రజాశక్తి - టి నరసాపురం

మండలంలో నాణ్యమైన రోడ్లు వేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడిగడప జయరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక యూనియన్ బ్యాంక్ వద్ద నుంచి విజయలక్ష్మీ థియేటర్ వరకు మంగళవారం ర్యాలీ చేసి అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ అధికారులు వెంటనే స్పందించి నాణ్యమైన రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు.

దేశ నాయకుల ఫొటోలు వితరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి దేశ నాయకుల ఫొటోలు వితరణ చేశారు. 1988–89 టెన్త్ బ్యాచ్‌కు చెందిన శీతాల వినాయకరావు సుమారు రూ.ఎనిమిది వేలతో 26 మంది దేశ నాయకుల ఫొటో ఫ్రేమ్స్ పాఠశాలకు అందించారని ప్రధానోపాధ్యాయులు, అదే పాఠశాల పూర్వ విద్యార్థి తోట పోతురాజు తెలిపారు. ఈ మేరకు వినాయకరావును పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

భారీ కొండచిలువ హతం

చింతలపూడి :చింతలపూడి వైఎస్ఆర్ కాలనీలోకి భారీ కొండ చిలువ వచ్చింది. స్థానికులు భయంతో ఆ కొండచిలువను హత మార్చారు. చింతలపూడి నగర పంచాయతీలో విషసర్పాలు తిరుగుతున్నాయని, వీధి లైట్లు వెలగడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నారాయణపురం సొసైటీ పాలకవర్గ నియామకం

ప్రజాశక్తి - ఉంగుటూరు


రవిశంకర్

చేబ్రోలు విశాల సహకార సంఘం (నారాయణపురం సొసైటీ) పాలక వర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సొసైటీ అధ్యక్షునిగా టిడిపి మండల కమిటీ మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచి, మాజీ ఎంపిటిసి సభ్యులు కాగుపాడుకు చెందిన కడియాల రవిశంకర్, డైరెక్టర్లుగా నీలాద్రిపురానికి చెందిన దుర్గారావు, రామచంద్రపురానికి చెందిన గౌతు బాల భాస్కరరావులను నియమించారు.

సాగునీటి, మురుగు వనరులను ప్రక్షాళన చేయాలి

ఉంగుటూరు ఎంఎల్‌ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు


అధికారులతో సమీక్షిస్తున్న ఎంఎల్‌ఎ ధర్మరాజు

స్వర్ణాంధ్ర విజన్ ప్రణాళికపై ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు అధ్యక్షతన మంగళవారం నారాయణపురం క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. నియోజకవర్గ నోడల్ అధికారి, ఉద్యానవన శాఖ డీడీ రామ్మోహన్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర విజన్–2047 సాధన కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ శాఖల అధికారులు లేవనెత్తిన ప్రతిపాదనలు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ధర్మరాజు మాట్లాడుతూ సాగునీటి, మురుగు వనరులను ప్రక్షాళన చేయాల్సిం దేనని, ఆక్రమణలను కచ్చితంగా తీసి తీరాలని ఆదేశించారు. పి–4 కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో 10351 బంగారు కుటుంబాలు, 800 మంది మార్గదర్శకులను గుర్తించినట్లు నోడల్ ఆఫీసర్ రామ్మోహన్ తెలిపారు. టిడిపి మండలాధ్యక్షుడు వేములపల్లి సుధీర్ మాట్లాడుతూ గ్రామాలను సమాజ సేవలుచేసేవారు, గ్రామాలకు ఆర్థిక సాయం అందించేందుకు మార్గదర్శకులను గుర్తించడమే కాకుండా వారందరితో సమావేశం ఏర్పాటు చేసి వారిని సత్కరిస్తే మరింత మంది దాతలు స్ఫూర్తితో ముందుకు వస్తారని సలహా ఇచ్చారు. క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి కృష్ణంరాజు, ఎఎంసి ఛైర్మన్ కరేటి జ్యోతి అయ్యప్ప, ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్ పాల్గొన్నారు.

పలుచోట్ల 'సుపరిపాలనలో తొలిఅడుగు'

ప్రజాశక్తి - కలిదిండి

రాష్ట్రంలో అభివృద్ధిని గాడి తప్పించేందుకే జగన్ కుట్రలు చేస్తున్నారని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. స్థానిక పేట కలిదిండిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటా తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది పాలన అభివృద్ధిని వివరించారు.

ఏలూరు సిటీ : స్థానిక రెండో డివిజన్‌లో మంగళవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాలను అందించి, వారు పొందిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లోని రోడ్లు, డ్రెయిన్ల సమస్యను, కల్వర్టు నిర్మాణం గురించి స్థానికులు తెలపగా ఆ సమస్యలకు పరిష్కారమార్గాలు చూపాలని అధికారులను ఆదేశించారు.

దెందులూరు :కూటమి ఏడాది పాలనపై ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. మండలంలోని మేదినరావుపాలెం, జోగన్నపాలెం, శ్రీరామవరం, గాలయగూడెం గ్రామాల్లో నిర్వహిం చిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పాలన ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందించారు. శ్రీరామవరం గ్రామానికి చెందిన పలువురు వైసిపి కార్యకర్తలు ఎంఎల్‌ఎ సమక్షంలో టిడిపిలో చేరారు.

టిడిపి నేత ముక్తేశ్వరరావు మృతి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని సగ్గూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు సగ్గుర్తి ముక్తేశ్వరరావు(51) కేన్సర్ వ్యాధితో బాధపడుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. ఉపాధి నిమిత్తం విజయవాడకు వెళ్లిన ఆయన పటమట కౌండిన్యనగర్‌లో గత 25 ఏళ్లుగా తన కుటుంబంతో నివసిస్తూ, పటమట 13వ డివిజన్ టిడిపి నాయకులుగా కొనసాగుతున్నారు. సగ్గుర్తి ముక్తేశ్వరరావు భౌతికకాయాన్ని విజయవాడ తూర్పు ఎంఎల్‌ఎ గద్దె రామ్మోహన్‌రావు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముక్తేశ్వరరావు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవడంతో పాటు ఆ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేల చర్యలు చేపడతానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జి జి.బద్రి, ఆర్.యల్లయ్యబాబు, టిడిపి 13వ డివిజన్ అధ్యక్షులు గద్దె ప్రసాద్, శాలివాహన కుమ్మరి కార్పొరేషన్ ఛైర్మన్ పి.ఈశ్వర్, ఆర్‌టిసి యూనియన్ నాయకులు ఎస్.ప్రభాకరరావు, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.


కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న రామ్మోహన్‌రావు

ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు

కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి వేడుకలను మంగళవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కటింగ్‌లు చేశారు.

ప్రజాశక్తి - ఏలూరు సిటీ


ఏలూరులో....


ద్వారకాతిరుమలలో...

ఏలూరులోని ఫైర్ స్టేషన్ సెంటర్‌లో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ ఆధ్వర్యంలో రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వంగాయగూడెం సెంటర్, తూర్పు వీధి గంగానమ్మ గుడి సెంటర్, గన్నవరంపేట, బీడీ కాలనీలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాస్, రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి సుధీర్ బాబు, బిసి సెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో గౌడ రంగబాబు, కొమ్మన సాంబశివరావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో మాజీ ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన భారీ కేక్‌లను కట్ చేశారు. నూజివీడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్ చిత్రపటానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మరీదు కృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ద్వారకాతిరుమల : మండల కేంద్రమైన ద్వారకాతిరుమలలో వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ హోమ్ మినిస్టర్, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తానేటి వనిత పూలమాల వేసి నివాళులర్పించారు. మండల గ్రామ నాయకుల అధ్యక్షతన కేక్ కటింగ్ చేశారు. మండలాధ్యక్షులు ప్రతాప్, టౌన్ ప్రెసిడెంట్ అచ్యుత ఏసుబాబు, సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : పట్టణంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు కర్పూరం గురవయ్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వెయ్యి మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండలాధ్యక్షులు ఓరుగంట నాగేంద్ర పాల్గొన్నారు. రావికంపాడులో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

చింతలపూడి : కాంగ్రెస్ నియోజకవర్గ కార్యాలయంలో కాంగ్రెస్ నేత ఉన్నమట్ల ఎలిజా ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు సుందరరావు, పార్టీ మండలాధ్యక్షులు జగ్గవరపు కోటిరెడ్డి, జిల్లా మహిళ అధ్యక్షురాలు సాదర బోయిన వరలక్ష్మి పాల్గొన్నారు. ఫైర్ స్టేషన్ వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు నాయక్ పాల్గొన్నారు.

కుక్కునూరు : కుక్కునూరులో వైసిపి మండలాధ్యక్షులు తాండ్ర రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంచారు. మండల నాయకులు రావు వినోద్, మల్లెల చంటి నాయుడు, కుచర్లపాటి కృష్ణరాజు పాల్గొన్నారు.

ముసునూరు : ముసునూరులోని వైసిపి కార్యాలయంలో వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొండా దుర్గాభవాని వెంకటరావు, మూల్పూరి నాగ వల్లేశ్వరరావు, రేగుల గోపాలకృష్ణ, మానికల గంగాధరరావు, పేరం కృష్ణ, తులిమెల్లి సుబ్బారావు, రంగారావు, రామా రావు, సురేష్, రెడ్డి తిరుపతిరావు, మురళీ పాల్గొన్నారు.

పోలవరం : గూటాల గ్రామం కొండ్ర వీధిలో బస్టాండ్ వద్ద ఉన్న విగ్రహానికి ఎంపిపి సుంకర వెంకటరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి కేక్ కటింగ్ చేశారు. పోలవరంలో మండల కన్వీనర్ బుగ్గ మురళీకృష్ణ ఆధ్వర్యంలో, ఎల్ఎన్‌డి.పేట, కొత్త పట్టిసీమ గ్రామాల్లో సీనియర్ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

జీలుగుమిల్లి : మండలంలోని పి.అంకంపాలెంలో వైఎస్ఆర్ మాజీ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు, లక్ష్మీపురంలో జాతీయ రహదారి వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి సొసైటీ మాజీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీలుగు మిల్లిలో ఎంపిపి కేక్ కట్ చేశారు. పాఠశాలలో పుస్తకాలు, మిఠాయిలు పంపిణీ చేశారు. పి.రాజవరంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిం చారు. సర్పంచులు సున్నం ఉషారాణి, పార్వతి, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, సుధారాణి, ఉప సర్పంచి కేతిరెడ్డి రాఘవ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : నారాయణపురంలో నిర్వహించిన వేడుకలకు ఎఎంసి మాజీ ఛైర్మన్ మరడ రమావతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చేబ్రోలు పిహెచ్‌సిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆ పార్టీ ఉంగుటూరు మండల కన్వీనర్మరడ వెంకట మంగారావు, ఎంపిటిసి ఛాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు, ఎంపిటిసి సభ్యురాలు అరివెళ్లి మహాలక్ష్మి, చేబ్రోలు, తిమ్మయ్యపాలెం, కైకరం, గొల్లగూడెం, నల్లమాడు గ్రామాల్లో ఆయా నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

టి.నరసాపురం :

మండలంలోని బందంచర్లలో వైఎస్ఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. కృష్ణాపురం, బొర్రం పాలెం తదితర గ్రామాల్లో వైసిపి నేతలు వైఎస్ఆర్ విగ్రహా నికి పూల మాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షులు వాసిరెడ్డి మధు, సర్పంచి గుండె వెంకటేశ్వం రావు, ఆచంట కుటుంబరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : బస్టాండ్ సెంటర్‌లో వైసిపి మండలాధ్యక్షులు బెజవాడ రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోళ్ల అనూష, జెడ్‌పిటిసి పిన్నిబోయిన వీరబాబు, వైసిపి నాయకులు పి.నరశింహారావు, ఎల్.రమేష్, వి.రాజు, కె.ధర్మయ్య, ఎస్‌కె.సుభానీ, కె.ప్రదీప్, జి.శ్రీనివాసరావు, ఆర్.సురేష్‌కు మార్, ఎం.శేఖర్, ఇవి.సుబ్బయ్య, వి.ప్రకాష్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని వడాలి, పేయ్యేరు, ములకలపల్లి గ్రామాల్లో వైసిపి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, నాయకులు విష్ణువర్ధన్, శీలం రామకృష్ణ, బత్తిన కిషోర్, జాస్తి చంటిబాబు, రాచురి కుమార్, మొట్రూ ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

వయసు చిన్నది.. ఆలోచన పెద్దది

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కేక్ కట్ చేసి బెలూన్లు పగలగొట్టి చాక్లెట్లు పంచుకోవడం వంటివి కాకుండా షణ్ముఖి అనే ఓ చిన్నారి తన పుట్టినరోజును వినూత్నంగా మరచిపోలేని విధంగా జరుపుకుంది. వృద్ధురాలికి ఆహారం అందిస్తూ తన పుట్టినరోజును సార్థకంగా మలచుకుంది. ఈ రోజు తన పుట్టినరోజు అని తెలిపిన ఆ పాప "నాన్న చెప్పారు పుట్టినరోజున మంచి పనులు చేయాలని... అందుకే అమ్మతో కలిసి అన్నం తీసుకుని వచ్చా" అని అమాయకంగా చెప్పడంతో చుట్టుపక్కల వారు ఎంతో అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - చింతలపూడి

ఈ నెల తొమ్మిదో తేదీ బుధవారం 33 / 11 కెవి సీతానగరం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి చింతంపల్లి 11 కెవి సీతానగరం ఎజిఎల్ ఫీడర్ల పరిధిలో చెట్ల నరికివేత, లైన్ మరమ్మతుల నిమిత్తం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జంగారెడ్డిగూడెం ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్.అహ్మద్ ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యర్రగుంటపల్లి ఆయా ఫీడర్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖ వారికి సహకరించాలని పేర్కొన్నారు.